

అలుగుకు గంగా హారతి



కీసర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చీర్యాలలోని నాటికన్ చెరువు నిండి అలుగుపారింది. దీంతో లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఫౌండర్, చైర్మన్ ఎం. లక్ష్మీనారాయణ అలుగుకు గంగా హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణ.. ఆక్రందన 7

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

మేడ్చల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్: స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1969 తొలి దశ ఉద్యమంలోనే బాపూజీ మంత్రి పదవికి రాజీనామా చేసి తెలంగాణ సాధనకు అండగా నిలిచిన మహనీయుడు అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై తన ఆస్తులన్నీ దానం చేసిన త్యాగశీలి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్వో మంగీలాల్, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, డీటీడీసీ కమలాకర్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి వెంకయ్య, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్ కుమార్, డీపీఆర్వో చెన్నమ్మ, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ కలెక్టరేట్‌లో లక్ష్మణ్ చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

మేడ్చల్ కలెక్టరేట్‌లో..

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఆర్వో హరిప్రియ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాంబశివరావు తదితరులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు బాబు మోజెస్, రామ్మోహన్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

జెడ్పీ పీఠాల

రిజర్వేషన్లు ఖరారు



రంగారెడ్డి జిల్లా ఎస్సీ మహిళ- వికారాబాద్ జిల్లా బీసీ జనరల్

లాటరీ ద్వారా మహిళా రిజర్వ్‌డ్ స్థానాల ఎంపిక

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ పీఠాల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే రెండు జిల్లాల కలెక్టర్ల సమక్షంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల రిజర్వేషన్లను సైతం ఖరారు చేశారు. అలాగే ఈ స్థానాల్లో మహిళలకు రిజర్వు చేసే స్థానాలను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. అయితే వీటిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీంతో ఆశావహులు ఆయా స్థానాల్లో టికెట్లు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.



కలెక్టరేట్‌లో రిజర్వేషన్ల కోసం లాటరీ తీసి చూపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):రంగారెడ్డి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలో 21 మండలాలు ఉండగా, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లతో పాటు 42 శాతం మేరకు బీసీలకు రిజర్వు చేశారు. మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లో ఎస్టీలకు మూడు స్థానాలు కేటాయించగా, ఎస్సీలకు నాలుగు స్థానాలు, బీసీలకు తొమ్మిది స్థానాలు, అన్ రిజర్వుడ్‌కు అయిదు స్థానాలు కేటాయించారు. జెడ్పీటీసీ స్థానాల్లో ఎస్టీలకు మూడు స్థానాలు కేటాయించగా, ఎస్సీలకు నాలుగు, బీసీలకు తొమ్మిది స్థానాలు, అన్ రిజర్వుడ్‌కు అయిదు స్థానాలు రిజర్వు చేశారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్‌లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి లాటరీ నిర్వహించారు. జడ్పీటీసీ స్థానాల్లో తొమ్మిది, ఎంపీపీ స్థానాల్లో తొమ్మిది స్థానాలను డ్రా ద్వారా మహిళలకు రిజర్వు చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై

మిగతా 7వ పేజీలో...

జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లు ఇలా..

జెడ్పీటీసీలు	20
ఎస్టీ	02
ఎస్సీ	04
బీసీ	08
జనరల్	06
ఎంపీపీలు	20
ఎస్టీ	02
ఎస్సీ	04
బీసీ	08
జనరల్	06



లలితా త్రిపుర సుందరీదేవిగా..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం కీసరగుట్టలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.
-కీసర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి)



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురం

మేడ్చల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. రకరకాల పూలతో పెద్ద బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. కార్యక్రమంలో డీఆర్వో హరిప్రియ, డీఎంహెచ్ఓ ఉమాగౌరి, కో ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత, సాంస్కృతిక కళాకారులు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏసీబీ వలలో టీపీవో

రియల్ ఎస్టేట్ యజమాని వద్ద రూ.5 లక్షలు డిమాండ్ చేసిన టీపీవో రాధాకృష్ణ

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



మేడ్చల్‌టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న పనుల కోసం తమ వద్దకు వచ్చే సామాన్యులు మొదలు వెంచర్లు వేసి ఇళ్ల స్థలాలు విక్రయించే రియాల్టీ సంస్థల యజమానులనూ అధికార యంత్రాగం లంచం కోసం వేధిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎల్లపేట మునిసిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రహరీ, గేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని లంచం అడిగిన టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) రాధాకృష్ణ ఏసీబీ అధికారుల వలలో పడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏసీబీ డీఎస్పీ జి.శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు ఎల్లపేట పరిధిలోని గంగస్థాన్ హెచ్ఎండీఏ వెంచర్ ప్రహరీ, గేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని టీపీఓ రాధాకృష్ణ రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అడ్వాన్సుగా రూ.లక్ష చెల్లించిన వెంచర్ యజమానులు.. తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కొంపల్లి సమీపంలోని రాయచందాని షాపింగ్ మాల్ వద్ద ఏసీబీ అధికారుల సూచన మేరకు శనివారం రాధాకృష్ణకు వెంచర్ యజమానులు రూ.3.5 లక్షలు చెల్లించారు. అక్కడే జి.శ్రీధర్ సారథ్యంలో అక్కడే మాటు వేసిన ఏసీబీ సిబ్బంది.. రాధాకృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, అతని వద్ద నగదు స్వాధీనం చేసుకున్నారు.

అనంతపద్మనాభ స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వర్‌రావు

వికారాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వర్‌రావు శనివారం అనంతగిరిలోని శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. పోర్ట్‌ఫోలియో జడ్జిగా నియమితులైన తరువాత ఆయన తొలిసారిగా జిల్లా కోర్టులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాకు మరో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సెకండ్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రాన్ని అందించిన వారిలో బార్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, సెక్రటరీ వెంకట్ రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీ పి. ఆనంద్, న్యాయవాదులు లవకుమార్, గోవర్ధన్ రెడ్డి ఉన్నారు. అంతకుముందు కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అనంతగిరి వద్ద ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి, అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప, కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరామ్, తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల , బార్ న్యాయవాదులు యాదవరెడ్డి, వసుంధర, రమేశ్ గౌడ్, పూజ, తులసిదాస్ పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

అలుగెత్తిన ప్రాజెక్టులు.. ఉప్పొంగిన వాగులు

రెండు రోజులుగా వికారాబాద్, రంగారెడ్డి జిలాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రోజంతా కురిసిన వర్షానికి నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మూసీ, ఈసీ, కాగ్నా, కాక్రవేణి నదులు వరదతో పోటెత్తాయి. ప్రాజెక్టులు, చెరువులు అలుగెత్తి ప్రవహించాయి. గత 24 గంటల్లో అత్యధికంగా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలో 151.3 మి.మీ. వర్షం కురిసింది. బషీరాబాద్ మండలంలో కాగ్నా నది ఉప్పొంగటంతో 50 నుంచి 60 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. తాండూరు మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. అలాగే పదుల సంఖ్యలో ఇళ్ల కూలిపోయాయి. వేల ఎకరాల్లో పత్తి, వరి, పసుపు, మొక్కజొన్న పంటలు, పూలతోటలు ధ్వంసమయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని 1,187 చెరువుల్లో 632 చెరువులు అలుగుపారుతున్నాయి.



పెద్దేముల్ మండలం ఇందూర్‌లో ధ్వంసమైన పత్తి పంటను చూపుతున్న రైతులు

- నీట మునిగిన పత్తి, వరి, మొక్కజొన్న పసుపు పంటలు
- కాగ్నా నది ఉధృతికి సుమారు 60 మూగజీవాల మృత్యువాత
- జలదిగ్బంధంలో వీర్‌శెట్టిపల్లి గ్రామం
- కొట్టుకుపోయిన కోకట్ బ్రిడ్జి.. నిలిచిన రాకపోకలు
- మోమిన్‌పేటలో అత్యధికంగా 51.3 మి.మీ. వర్షపాతం
- వాగుల ఉధృతినిని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ



వర్షం ఉధృతికి కొట్టుకుపోయిన కోకట్ బ్రిడ్జి

ఆంధ్రజ్యోతి నెటవర్క్, సెప్టెంబర్ 27: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామం చుట్టూ నీరు చేరడంతో గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఓగిపూర్ గ్రామ శివారులోని జట్టూర్ కాగ్నా నదిలో చిక్కుకుపోయిన ఇద్దరు లారీ డ్రైవర్‌లను ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. యాలాల మండలంలోని వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో తాండూరు - కోకట్ రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కోకట్ వాగును కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. జీవన్గి వద్ద కాగ్నా నది ఉప్పొంగి ప్రవహించడంతో వరద ఇళ్లను చుట్టుముట్టింది. యాలల మండలంలోని రాస్నంలో దోర్నాల నర్సింహులు ఇల్లు, ముకుందాపూర్‌లో కేతావత్ దేవమ్మకు చెందిన రెండు ఇళ్లు వర్షానికి కూలిపోయాయి. పెద్దేముల్ మండలం పాషాపూర్ గ్రామ పంచాయతీ రాంసింగ్ తండాలో సీతమ్మ చెరువు కట్ట తెగిపోవడంతో పక్కనున్న పంట పొలాలకు నీరు చేరి పలు పంటలు దెబ్బతిన్నాయి. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో సబ్ స్టేషన్‌లోకి నీరు చేరింది. సంగెం కలాన్ గ్రామంలో సిమెంట్ కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగుల బైకులు కొట్టుకుపోయాయి. అలాగే, బషీరాబాద్ మండలం జీవన్గి

మిగతా 8వ పేజీలో...

అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. శనివారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖ అధికారులు, ఉద్యోగులు తమ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయట ప్రయాణాలు చేయొద్దని ప్రజలకు సూచించారు.
-గడ్డం ప్రసాద్‌కుమార్, స్పీకర్

ఏటీసీని యువత సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 27, (ఆంధ్రజ్యోతి): మీర్కాన్‌పేటలో నిర్మించిన ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రం)ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఏటీసీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. టాటా గ్రూపు సహకారంతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఏటీసీలో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు సాంకేతిక వృత్తుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఇక్కడ నిర్మించే ఫ్యూచర్ సిటీ డెవెలప్మెంట్ అథారిటీ, ఫోర్త్ సిటీలతో ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు. టాటా కంపెనీ సహకారంతో ఏటీసీ కేంద్రాన్ని నిర్మించడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. రక్షణ రంగంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి చెందిందని, ఇలాంటి కంపెనీల్లో యువత శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రావు, ఏటీసీ ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, పల్లె కృష్ణాగౌడ్, మల్లేశ్, పాండు, నిమ్మ అంజిరెడ్డి,రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వి.బాల్‌రాజ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


మీర్కాన్‌పేటలో ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు


కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

కూలిన సొసైటీ పాత భవనం

ధారూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధి కేరెల్లిలోని సొసైటీ పాత భవనం ఒక వైపు కూలిపోయింది. శనివారం ఈ భవనాన్ని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, సీఈవో కె.నర్సింహులు పరిశీలించారు. ఈ భవనంలో ఎరువులు నిల్వ చేసేవారు. వర్షాలకు కూలిపోయిన ఈ భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామని చైర్మన్ తెలిపారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కోట్‌పల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. వర్షాలు కురుస్తున్న వేళ ప్రజలు బయటికి రావొద్దని సూచించారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద, కూలిపోయే ఇళ్లలో, చెట్లకింద ఉండొద్దన్నారు.

రోడ్డు మధ్యలో దిగబడిన లారీ

● నిలిచిపోయిన వాహనాలు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):భారీ వర్షాలకు 167 జాతీయ రహదారిపై పర్సాపూర్ వద్ద శనివారం మట్టి రోడ్డులో లారీ దిగబడింది. గంటల తరబడి ట్రాఫిక్ జామైంది. మహబుబ్‌నగర్-తాండూరు వెళ్లే వాహనాలను హస్నాబాద్, పెద్ద నందిగామ, గుండ్లకుంట మీదుగా మళ్లించారు.



ఘనంగా బతుకమ్మ సంబురాలు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రెడ్డి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో సంఘం అధ్యక్షురాలు అరుంధతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని, ఆడిపాడారు. రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాల్లో పాల్గొన్న ప్రతి మహిళను సన్మానించి, బహుమతులను అందజేశారు. అల్లు హేమలత బతుకమ్మకు ప్రథమ బహుమతికి, పి.రజితకు సెకండ్ ప్రైజ్ వచ్చింది. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించి, భవిష్యత్తు తరాలకు అందిస్తున్న మహిళలను అభినందించారు. రెడ్డి మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాండ్ర విశాలశ్రవణ్ కుమార్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, రెడ్డి మహిళా సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జి.వసంతరెడ్డి, కోశాధికారి స్వాతిరెడ్డి, సంఘం నాయకులు జి.రవీందర్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, యువజన సంఘం నాయకులు మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా ఉద్యమాలు

షాద్‌నగర్ అర్బన్/కందుకూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కుల సాధననే లక్ష్యంగా ఉద్యమాలను నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మూడో మహాసభ తీర్మానించింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బసవపున్నయ్యల సమక్షంలో కందుకూరులో నిర్వహించిన మహాసభ శుక్రవారం రాత్రి ముగిసింది. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జర్నలిస్టుల సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణపై తీర్మానాలు చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా శేరిబాయి గణేష్, కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి వడ్ల శ్రీనివాసచారి, గౌరవ సలహాదారుగా ఎల్.మోహన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, సిర్సవాడ చంద్రశేఖర్, భవాని వేణుగోపాల్, మణికుమార్, సుదర్శన్‌గౌడ్, డి.రాందాస్, రాజశేఖర్, ఎస్.శ్రీనివాస్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా సురేష్, వెంకటేష్, రాఘునందన్‌గౌడ్, మన్సూర్ అలీఖాన్, ప్రభాకర్, టి.శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్.నర్సింహ్మలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఖాజాపాషా, సురేష్, శ్రీనివాస్, ఆనంద్, ఆంజనేయులు, రఘుపతి, అశోక్‌గౌడ్, రమేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా దేవేందర్‌లను ఎన్నుకున్నట్టు నూతన అధ్యక్షుడు గణేష్ తెలిపారు.

గ్రూప్1 ఉద్యోగ సాధకులకు ఎమ్మెల్యే అభినందన

పరిగి, సెప్టెంబరు, 27(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియమాక పత్రాలను అందుకున్న పరిగి నియోజకవర్గానికి చెందిన చెందిన ఇద్దరిని శనివారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అభినందించారు. కులకచర్లకు చెందిన టి.మౌనిక జిల్లా రిజిస్ట్రార్‌గా, తీర్మలాపూర్‌నకు చెందిన మారుతి మునిసిపల్ కమిషనర్‌గా నియమాక పత్రాలను అందుకున్నారు. వీరద్దరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నస్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



మౌనిక, మారుతిలకు నియామక పత్రాలు అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

సీఎం నుంచి నియామక పత్రం స్వీకరణ



బొంరాస్‌పేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేటకు చెందిన గ్రూప్-1 అభ్యర్థి క్రాంతికుమార్ ఎంపీడీవోగా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాంత్రికుమార్ నియామకపత్రం అందుకున్నారు.

మట్టి రోడ్డును బీటీగా మార్చండి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల, సెప్టెంబరు, 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్పుల తండా పరిధి మక్త తండా నుంచి ఆర్కపల్లి వరకు ఉన్న మట్టిరోడ్డు వర్షానికి గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తండావాసులు వాపోయారు. ద్విచక్ర వాహనచోదకులు ఈ రోడ్డుపై వెళ్లలేపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మట్టి రోడ్డును బీటీగా మార్చాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో తండా వాసులు శనివారం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సమస్య విన్న అధికారి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో బాల్‌నాయక్, జంగునాయక్, రాజశేఖర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషశ్రీ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నిక విధులను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈవో రామ్‌రెడ్డి సూచించారు. మండలానికి ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా నియామకమైన అధికారులకు శనివారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఎంఈవో, టీవోటీ అబ్దుల్ హక్ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించే ఈ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికకు పార్టీ గుర్తులు ఉంటాయని, పంచాయతీలకు పార్టీ గుర్తులు ఉండవని అధికారులు తెలిపారు.

గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన



దుద్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలానికి మంజూరైన ధాన్యం నిల్వ గోదాం నిర్మాణానికి ఆర్ఐ నవీన్‌కుమార్, గిడ్డంగుల సంస్థల కార్యాలయ సిబ్బంది మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రం శివారులో గల 191 సర్వే నంబర్‌లో 75ఎకరాల ప్రభుత్వ భూమిలో, 10ఎకరాల్లో గోదాం నిర్మిస్తారు. అలాగే ప్రభుత్వం సోలార్ ప్లాంట్ నిర్మాణానికి, పార్కుకు స్థలాన్ని కేటాయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, రవినాయక్, ఖాజా, వెంకట్‌రెడ్డి, ఖలీల్ పాష పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడికి చంద్రవాహన సేవ



వికారాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. నిత్య వాహన పూజలో భాగంగా శనివారం స్వామి వారిని చంద్ర వాహనంపై ఊరేగించారు. ఆలయ పరిసరాలు, గ్రామ వీధుల గుండా స్వామి వారిని ఊరేగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి పద్మనాభం, కార్యనిర్వహణాధికారి నరేందర్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో పట్టణ ప్రముఖులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొంటున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరవలేనివి



లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం పదవులను సైతం లెక్కచేయని త్యాగ ధనుడు, మలిదశ తెలంగాణ ఉద్యమ మార్గదర్శి, బలహీన వర్గాల ఆశా జ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌పాల్‌గౌడ్, నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, కుండె వెంకటేశ్, యాదీష్, సుదర్శన్‌యాదవ్, కాసాని వెంకటేష్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు మనోహర్, శ్రీనివాస్, స్వప్ననవీన్, రాజు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పతనం తప్పదు



విలేకరులతో మాట్లాడుతున్న పొనుగోటి అర్జున్ రావు

ఆమనగల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు అన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లులో శనివారం విలేకరుల సమావేశంలో అర్జున్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల రైతులను వేదనకు గురిచేస్తోందని చెప్పారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖలీల్, గండికోట శంకర్, వెంకటయ్య, శేఖర్, సైదులుగౌడ్, తదితరులు ఉన్నారు.

కల్వర్టు వెడల్పు చేయాలని గ్రామస్తుల ధర్నా



పెద్దేముల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందూరు వాగు కల్వర్టును వెడల్పు చేసి ఇళ్లలోకి వరద రాకుండా చూడాలని గ్రామస్తులు తాండూరు-జహీరాబాద్ రోడ్డుపై శనివారం ధర్నా నిర్వహించారు. ఇందూరులో ఇళ్ల సమీపం నుంచి వాగు ప్రవహిస్తోంది. వర్షాలు కురిసినపుడు నీటి ప్రవాహంతో నీరు ఇళ్లలోకి చేరుతోంది. ఇళ్లలో నిత్యావసర సరుకులు పాడవుతున్నాయి. రాత్రివేళ వాగు వస్తే నిద్రలేకుండానే ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులు తొలగించాలని రోడ్డుపై బైఠాయించారు. అధికారులొచ్చి హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించం అని భీష్మించారు. సుమారు 3గంటలపాటు రవాణా స్తంభించింది.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం : తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్

గ్రామస్తుల రాస్తారోకోతో తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్, ఎస్ఐవేణుకుమార్ గ్రామానికి వెళ్లి మాట్లాడారు. వస్తువులు తడిసిపోయాయని అధికారుల దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ స్పందిస్తూ సమస్యపై తాను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. నష్టం కలిగిన వారి వివరాలను సేకరించి, నిత్యావసర వస్తువులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కల్వర్టు విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆటో.. ముగ్గురి మృతి

- ఏడుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- రోడ్డుపై డీసీఎం టైరు మార్చుతుండగా దుర్ఘటన
- కందుకూరు వద్ద ప్రమాదం




మృతులు : సత్తమ్మ, శ్రీధర్(ఫైల్)



శ్రీనివాస్(ఫైల్)

కందుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్‌టీఆర్ తండా వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. యాచారం మండలం కుర్మిద్దకి చెందిన 10మంది మహేశ్వరం మండలం రావిరాల వద్ద గత క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ కంపెనీలో పని చేస్తుంటారు. వీరంతా రోజు మాదిరిగా ఓ ఆటోలో శుక్రవారం రాత్రి కంపెనీ నుంచి తిరిగి గ్రామానికి బయల్దేరారు. ఎన్‌టీఆర్ తండా వద్ద ఉన్న బ్రిడ్జిపై ఓ డీసీఎం (ఆర్‌ఎంసీ కాంక్రీటు పంపు) టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు మధ్యలో నిలిపి టైర్‌ను మారుస్తున్నారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన ఆటో డీసీఎంను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సురిగి శ్రీనివాస్(39), పంది శ్రీధర్(26), పంది సత్తమ్మ(49) అక్కడికక్కడే మృతిచెందారు. అందులో ప్రయాణిస్తున్న లింగమ్మ, జంగమ్మ, స్వరూప, శాంతమ్మ, హంసమ్మ, అరుణ, మంజులకు తీవ్ర గాయాలు, ఆటో వెనుక కూర్చున్న మరియమ్మ, రేణుక, లావణ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

● సింహ వాహనంపై ఊరేగింపు



స్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

వికారాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి రజతోత్సవ బ్రహ్మోత్సవాలు ఆరో రోజు కనుల పండువగా నిర్వహించారు. శనివారం ఆలయంలో సుప్రభాత సేవ, మహాభిషేకం, నైవేద్యం, మంగళ హారతి, అర్చనలు, భక్తుల దర్శనాల అనంతరం శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి సింహ వాహనంపై ఊరేగింపు అనంతరం ఊయల సేవతో వేడుక నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జనగర్జన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ జన గర్జన సభను విజయవంతం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటేశ్ కోరారు. కేటీఆర్ రాక నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లులో శనివారం వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. అచ్చంపేట సభకు భారీగా జనసమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. సభ విజయవంతం ద్వారా బీఆర్ఎస్ సత్తాచాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఆక్రమణ.. ఆక్రందన

● నాలాలపై నిర్మాణాలు చేపట్టిన పరిశ్రమ

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- వర్షాలకు చెరువులా మారుతున్న పోచారం రోడ్లు.. కాలనీలు జలమయం
- పట్టించుకోని అధికారులు
- వరద ఇబ్బందులు తీర్చాలని వేడుకోలు



జోడిమెట్ల వద్ద జాతీయ రహదారి పక్కన కల్వర్టుపై గోడ కట్టి నీటిని మళ్లించిన ఫ్యాక్టరీ యాజమాన్యం



చెరువులా మారిన జోడిమెట్ల చౌరస్తా(ఫైల్)

ఘట్‌కేసర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యథేచ్ఛగా నాళాల ఆక్రమణతో వర్షపు కాలనీలు, రోడ్లను ముంచెత్తుతోంది. పోచారం మున్సిపాలిటీ పరిధి జోడిమెట్ల చౌరస్తా వద్ద తరచూ వరదతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జోడిమెట్ల చౌరస్తా వద్ద ఓ పరిశ్రమ యాజమాన్యం నాళా ఆక్రమించింది. వరదను రోడ్డువైపునకు మళ్లించారు. చిన్న వర్షం కురిసినా పోచారం చెరువును తలపిస్తోంది. పోచారానికి రవాణా స్తంభిస్తోంది. ఘట్‌కేసర్ మండలంలో గజం భూముల ధరలు వేలు, లక్షలు పలుకుతుండడంతో వెంచర్ల నిర్వాహకులు స్థలాన్ని వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. నాళాలు, చెరువులు, కుంటలు, బఫర్, లోతట్టు ప్రాంతాలను ఆక్రమిస్తుండడంతో వరద నివాసాలు, కాలనీల్లో చేరుతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. వారిపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో ప్రజలకు వరద పాట్లు తప్పడం లేదు. హైదరాబాద్‌లో హైడ్రా ఆక్రమణలను తొలగిస్తున్నా పోచారం మున్సిపాలిటీ జోడిమెట్లలో ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. నారపల్లి, పోచారం ప్రాంతాలనుంచి వచ్చే వరద నీరు జోడిమెట్ల చౌరస్తా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దాటేందుకు రెండు 18పీట్ల నాళాలను నిర్మించారు. అయితే జోడిమెట్ల వద్ద ఈ నాళాలను పరిశ్రమ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టండంతో పోచారం రోడ్డులోనే వరద నీరు నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాలాలన్నింటినీ పునరుద్ధరించాలి



చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలనీలు చెరువుల్లా నిండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జోడిమెట్ల చౌరస్తా వద్ద ఆక్రమణలకు గురైన రెండు నాళాలను పునరుద్ధరించాలి. వరద నివారణకే గతంలో 18పీట్ల వెడల్పుతో నాళాలను కట్టారు. వెంటనే అధికారులు ప్రైవేట్ కంపని ఆక్రమణలోని నాలాలను విడిపించాలి.

- కొండల్‌రెడ్డి, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్

ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు చేశాం



జోడిమెట్ల చౌరస్తా వద్ద రెండు భారీ నాలాలు ఆక్రమణకు గురవడంతో తరచూ వరద సమస్యలు తలెత్తుతున్నాయి. కల్వర్టులకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టడం వల్లే వరద నీరు రోడ్లు, కాలనీలను ముంచెత్తుతోంది. ఆక్రమణలపై మున్సిపల్ అధికారులకు సూచించాం. ఈ విషయాన్ని హైడ్రాకు పిర్యాదు చేశాం. త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

- పరమేశ్, ఇరిగేషన్ ఏఈ, ఘట్‌కేసర్

50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- దస్తగిరి లింగమయ్య మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన
- వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లిన ఆందోళనకారులు
- పోలీసుల లాఠీచార్జి.. అరెస్టు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



లింగమయ్య(ఫైల్)

షాద్‌నగర్/కొందుర్గు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం వెంకిర్యాలకు చెందిన దస్తగిరి లింగమయ్యది ప్రభుత్వ హత్యేనని ఆయన బంధువులు ఆరోపించారు. ఏండ్ల తరబడి తంగెళ్లపల్లి-వెంకిర్యాల వాగుపై వంతెను నిర్మించకే బైక్ వస్తున్న లింగమయ్య వాగులో పడి మృతిచెందాడని అన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి వాగుపై బ్రిడ్జి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం లింగమయ్య కుటుంబ సభ్యులు, బంధువులు, బీజేపీ నాయకుడు ప్రశాంత్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పాత జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టి మృతదేహాన్ని తరలించారు. ఆందోళనకారులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చొరబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేశారు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. వెంకిర్యాలకు చెందిన దస్తగిరి లింగమయ్య(42) కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు. ఆయన భార్య ఇందిర షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హౌస్ కీపర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం రాత్రి ఇందిర విధులు ముగించుకుని వెంకిర్యాలకు వస్తున్నాని తనను పికప్ చేసుకునేందుకు రావాలని భర్తకు ఫోన్ చేసింది. దీంతో లింగమయ్య ద్విచక్ర వాహనంపై బయల్దేరి తంగెళ్లపల్లి-వెంకిర్యాల రోడ్డులో వాగుదాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కుటుంబీకులు అక్కడికి చేరుకొని భోరున విలపించారు. వాగుపై వంతెన లేకే తన భర్త చనిపోయాడని ఇందిర అన్నారు. బంధువులు మృతదేహాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపానికి తరలించి ఎమ్మెల్యే వచ్చి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలిసి షాద్‌నగర్ సీఐ విజయకుమార్ చేరుకొని మృతుడి కటుంబ సభ్యులతో, బీజేపీ నాయకుడితో మాట్లాడి మృతదేహాన్ని తరలించాలని కోరారు. ఎమ్మెల్యే వచ్చేదాకా కదిలేది లేదని వారు భీష్మించారు. ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉన్నారని చెప్పడంతో ఆర్డీవో, లేక అర్‌అండ్‌బీ అధికారులైనా రావాలని డిమాండ్ చేశారు. మీకు న్యాయం జరిగేలా చూస్తానని సీఐ చెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులు వినకపోవడంతో పోలీసులు చెదరగొట్టి మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి చొరబాటు

మృతదేహాన్ని తరలించడంతో ఆగ్రహించిన బీజేపీ నాయకుడు ప్రశాంత్, మృతిడి బంధువులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి చొరబడ్డారు. దీంతో పోలీసులు ఆందోళనకారులపై లాఠీచార్జి చేశారు. సీఐ వారిని అరెస్టు చేసి షాద్‌నగర్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహంతో ఆందోళన చేయడంతో పాత జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఆందోళనకారులను పక్కకు తప్పించి క్లియర్ చేశారు.

చర్చనీయాంశంగా మృతదేహం అప్పగింత

ప్రమాదంలో చనిపోయిన లింగమయ్య మృతదేహానికి కొందుర్గు పోలీసులు పోస్టుమార్టం చేయించకుండానే అప్పగించడం వివాదంగా మారింది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తే వాహనం వెంట పోలీస్ ఎస్కార్ట్ ఎందుకు లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం చేయించారో? లేదో అనేదానిపై స్పష్టం చేయకుండా కుటుంబ సభ్యులకు అప్పగించిచడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

మంచి పనులతో చిరస్థాయి గుర్తింపు



మోత్యనాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులు, అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మైసిగండిలో శనివారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, గిరిజన నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేపావత్ మోత్యనాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోత్యనాయక్ కుమారులు అనిల్‌నాయక్, విజయ్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్‌లతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మోత్యనాయక్ మండలానికి అందించిన సేవలు చిరస్మరణీయని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమ్లీ, నాయకులు వెంకటేష్, శేఖర్‌గౌడ్, తులసీరామ్, నర్సింహ, బిచ్యా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు రూపొందించాలి



శామీర్‌పేట ఏటీసీని పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/మేడ్చల్ టౌన్: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆవిష్కరణలను రూపొందించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. శనివారం శామీర్‌పేటలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ని ఆయన ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటకు తీసి మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక, ఐటీఐ కాలేజీ ప్రిన్స్‌పాల్ లలిత, అధ్యాపకులు పాల్గొన్నారు. మేడ్చల్‌లో ఏటీసీ సెంటర్‌ను అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ప్రారంభించారు. ఐటీఐ ప్రిన్స్‌పాల్ హనుమాన్ నాయక్, బి-గేట్ వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు ఏటీసీని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాండూరులో 172 సీట్లకు గాను పూర్తిగా భర్తీ కావడం అభినందనీయమని అన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



తాండూరులో ఏటీసీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

జెడ్పీ పీఠాల రిజర్వేషన్లు ఖరారు

(ఐదో పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం కేటాయించినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.



జెడ్పీటీసీ స్థానాల కేటాయింపు

జిల్లాలో జెడ్పీటీసీ స్థానాలు ఏయే వర్గాలకు రిజర్వు చేశారనేది అనధికారిక సమాచారం మేరకు.. ఎస్టీ కేటగిరిలో మంచాల (జనరల్), కొత్తూరు(జనరల్), ఫరూఖ్‌నగర్(మహిళ)కు కేటాయించినట్లు తెలిసింది. ఎస్సీ కేటగిరిలో శంకర్‌పల్లి(జనరల్), చేవెళ్ల(జనరల్), కందుకూరు (మహిళ), షాబాద్(జనరల్ మహిళ) రిజర్వు చేసినట్లు సమాచారం. బీసీ కేటగిరిలో మొయినాబాద్ (మహిళ), కొందుర్గు(జనరల్), ఇబ్రహీంపట్నం (మహిళ), కేశంపేట్ (మహిళ), యాచారం (జనరల్), మహేశ్వరం(మహిళ), తలకొండపల్లి(బీసీ జనరల్), కడ్తాల్(బీసీ మహిళ), మాడ్గుల(బీసీ జనరల్)కు రిజర్వ్ చేసినట్లు తెలిసింది. మిగిలిన అబ్దుల్లాపూర్, చౌదరిగూడెం, నందిగామ, శంషాబాద్, ఆమన్‌గల్ స్థానాలు అన్ రిజర్వుడ్ కేటగిరికి కేటాయించినట్లు సమాచారం.

ఎంపీపీ స్థానాలు: మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లో చేవెళ్ల(ఎస్సీ జనరల్), శంకర్‌పల్లి(ఎస్సీ జనరల్), షాబాద్(ఎస్సీ మహిళ),మొయినాబాద్(బీసీ మహిళ)కు రిజర్వు అయినట్లు తెలుస్తోంది. ఆమనగల్(జనరల్), కడ్తాల్(జనరల్ మహిళ), తలకొండపల్లి(ఎస్టీ జనరల్), మాడ్గుల (జనరల్)కు కేటాయించినట్లు సమాచారం. యాచారం(బీసీ జనరల్), మంచాల (బీసీ జనరల్), ఇబ్రహీంపట్నం(బీసీ మహిళ), అబ్దుల్లాపూర్‌మెట్ (బీసీ మహిళ), కందుకూరు (బీసీ జనరల్), శంషాబాద్ (ఎస్సీ మహిళ) రిజర్వు అయినట్లు తెలిసింది.

వికారాబాద్ జిల్లా సమాచారం

ఎంపీటీసీల రిజర్వేషన్లు

మొత్తం స్థానాలు	: 227
జనరల్	: 137
మహిళలు	: 90
ఎస్టీ	: 26
ఎస్సీ	: 47
బీసీ	: 97
జనరల్	: 57

వికారాబాద్ జిల్లాలో....

వికారాబాద్ జిల్లాలో 20 మండలాలు ఉండగా, జెడ్పీటీసీ, ఎంపీపీ పదవుల్లో ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లతో పాటు 42శాతం మేరకు బీసీలకు రిజర్వు చేశారు. పదవుల్లో సగభాగం మహిళలకు రిజర్వు చేశారు. ఎస్టీలకు రెండు స్థానాలు కేటాయించగా, ఒక స్థానం జనరల్, మరొక స్థానం మహిళకు కేటాయించారు. ఎస్సీలకు నాలుగు స్థానాలు రిజర్వు చేయగా, జనరల్‌కు రెండు, మహిళకు రెండు స్థానాలు రిజర్వు చేశారు. బీసీలకు ఎనిమిది స్థానాలు రిజర్వు చేయగా, వాటిలో నాలుగు స్థానాలు జనరల్‌కు, నాలుగు స్థానాలు మహిళకు కేటాయించారు. మిగిలిన ఆరు స్థానాలను అన్ రిజర్వుడ్‌గా ఉంచారు. దీంట్లో మూడు స్థానాలు జనరల్, మూడు స్థానాలను ఓసీ మహిళకు రిజర్వు చేశారు.

ఎంపీపీ పదవుల రిజర్వేషన్లు

చౌడాపూర్ ఎంపీపీ ఎస్టీ మహిళకు రిజర్వు చేయగా, పెద్దేముల్ ఎస్టీ జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. పూడూరు, కోట్‌పల్లి మండలాలు ఎస్సీ మహిళ, వికారాబాద్, పరిగి మండలాలు ఎస్సీ జనరల్‌కు రిజర్వు చేసినట్లు తెలిసింది. దుద్యాల్, యాలాల్, దోమ, కులకచర్ల మండలాలు బీసీ మహిళకు రిజర్వు చేయగా, ధారూరు, బంట్వారం, మర్పల్లి, బషీరాబాద్ మండలాలు బీసీ జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. అన్ రిజర్వుడ్‌కు దౌల్తాబాద్, కొడంగల్, నవాబ్‌పేట్ జనరల్ మహిళకు కేటాయించగా, తాండూరు, మోమిన్‌పేట్, బొంరాస్‌పేట్ అన్ రిజర్వుడ్ జనరల్‌కు రిజర్వు చేసినట్లు తెలిసింది.

జెడ్పీటీసీ స్థానాల్లో సగం...

జడ్పీటీసీ స్థానాల్లో చౌడాపూర్ మండలం ఎస్టీ మహిళకు రిజర్వు చేయగా, పెద్దేముల్ మండలం ఎస్టీ జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. ఎస్సీ మహిళకు పూడూరు, కోట్‌పల్లి మండలాలు, ఎస్సీ జనరల్‌కు వికారాబాద్, పరిగి మండలాలు రిజర్వు చేసినట్లు తెలిసింది. బీసీ మహిళకు దుద్యాల్, దోమ, మర్పల్లి, కులకచర్ల మండలాలు కేటాయించగా, యాలాల్, ధారూరు, బంట్వారం, బషీరాబాద్ మండలాలు బీసీ జనరల్‌కు రిజర్వు చేసినట్లు సమాచారం. తాండూరు, కొడంగల్, నవాబ్‌పేట మండలాలు ఓసీ మహిళ, దౌల్తాబాద్, మోమిన్‌పేట్, బొంరాస్‌పేట మండలాలు ఓసీకి రిజర్వ్ చేసినట్లు తెలుస్తోంది.

బీసీలకు 97 ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలో మొత్తం 227 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 137 ఎంపీటీసీ స్థానాలను జనరల్‌కు రిజర్వు చేయగా, 90 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు. మొత్తం ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 26 స్థానాలను రిజర్వు చేయగా, వాటిలో 16 స్థానాలు జనరల్, 10 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు. ఎస్సీలకు 47 స్థానాలను కేటాయించగా, వాటిలో 30 స్థానాలు జనరల్‌కు, 17 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు. బీసీలకు 97 స్థానాలు, వాటిలో 58 స్థానాలు జనరల్, 39 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు. మిగిలిన 57 స్థానాలు అన్ రిజర్వుడ్(జనరల్)కు కేటాయించారు. వాటిలో 33 జనరల్‌కు, 24 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు.

వర్ష బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)


ఘట్‌కేసర్: కొత్తగూడెం సమీపంలో మూసీనది ఉధృతి

శివారులో శుక్రవారం అర్ధ రాత్రి కాగ్నానది ఉప్పొంగటంతో పరీవాహక ప్రాంతంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలోని పశువుల షెడ్‌లోకి భారీగా వరద వచ్చింది. దీంతో అక్కడ సుమారు 140 మూగజీవాలు నీటమునిగాయి. దీంతో ఊపిరాడక సుమారు 60 జీవాలు మృతి చెందినట్లు తెలుస్తోంది. కొన్ని పశువులు తాడును తెంపుకుని సమీపంలోని బ్రిడ్జిపైకి చేరడంతో బతికి బయటపడ్డాయి. అందులో 102 ఆవులు, 15 కోడేలు, 24 లేగదూడలు ఉన్నాయి. ఇది మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రం ఉంది. విషయం తెలుసుకున్న ఆయన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి ఫోన్ చేసి స్థానికంగా సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని కోరినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే జీవన్గి గ్రామాన్ని డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డితో కలిసి సందర్శించారు. సమాచారం తెలుసుకున్న రెండు రాష్ట్రాల ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. అతికష్టం మీద అక్కడకు చేరుకొని కొన్ని మూగజీవాలను రక్షించారు.


పూడూరు: కడుమూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు


తాండూరు రూరల్: వరద ఉధృతి నుంచి లారీ డ్రైవర్‌ను రక్షించిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

'వికారాబాద్'లో నిలిచిన రాకపోకలు

మర్పల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిని రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మర్పల్లి మండలంలోని గుర్రంగట్టు తండా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. సిరిపురం సమీపంలోని వీరన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శుక్రవారం రాత్రి గ్రామంలో ఓ వృద్ధురాలు మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు శనివారం శ్మశానవాటికకు వెళ్లేందుకు అతికష్టం మీద తాళ్ల సాయంతో వాగును దాటాల్సి వచ్చింది. కల్కోడ గ్రామంలో చంద్రన్నసాగర్ వాగు పొంగిపొర్లడంతో 70 ఇళ్లలోకి వరద నీరు చేరింది. కాగా, మండల వ్యాప్తంగా తొమ్మిది ఇళ్లు కూలిపోయాయి. బంట్వారం మండలంలో వందల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, పసుపు , కంది, పంటలు నీటమునిగాయి. కాగా, సుల్తాన్‌పూర్, కొత్తపల్లి చెరువు అలుగులో శుక్రవారం రాత్రి కొట్టుకుపోయిన చింతకింది రవి(35) మృతదేహం సుల్తాన్‌పూర్ సమీపంలో లభ్యమైంది. మృతుడి అన్న దేవప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విమల తెలిపారు. ధారూరు మండలంలోని రాంపూర్ తండాలో పొలంలోని పశువుల షెడ్‌లోకి మన్‌సాన్‌పల్లి వాగులోని వరద చేరడంతో తార్యానాయక్‌కు చెందిన నాలుగు గేదేలు, నాలుగు దూడెలు వరద నీటిలో కొట్టుకుపోయి జాడ తెలియని పరిస్థితి. పొలాల్లోని 15 విద్యుత్ స్తంభాలు, ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో కొట్టుకుపోయాయి. కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు గట్టేపల్లిలోని పంట పొలాలను ముంచెత్తింది. కోట్‌పల్లి మండలంలోని బార్వాద్, ఎన్నారం, కొత్తపల్లి, లింగంపల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగాయి.


యాలాల: కోకట్ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే


బషీరాబాద్: జీవన్గీ కాగ్నా నది ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


పరిగి: భవానినగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

అలుగుపారిన ఐనాపూర్ చెరువు

పరిగి పట్టణంలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేయడంలో జనాలు ఇబ్బందులు పడ్డారు. లక్నాపూర్ ప్రాజెక్టు నిండి ప్రవహిస్తోంది. మిట్టకోడూరు చెరువు అలుగు పొంగిపారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బాసుపల్లి - గోడుగోనిపల్లి, దోమ - పాలేపల్లి, బుద్లాపూర్ - బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల మధ్య రాకపోకలు స్థంభించాయి. పూడూరు మండలం కడుమూరు వద్ద ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దోమ మండలం ఐనాపూర్ పెద్ద చెరువు 35 ఏళ్లలో అలుగు పారడం ఇది రెండోసారి. పరిగి పట్టణంలో ఉన్న మిషన్ భగీరథ డీఈ కార్యాయలం పరిసరాలు జలమయంగా మారాయి. పూడూరు మండల పరిధిలోని కడుమూరు ఈసీ వాగు పొంగి ప్రవహించింది. అలాగే కొడంగల్ నియోజకవర్గంలోని వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. హస్నాబాద్ పెద్ద చెరువులోకి వరద నీరు భారీగా చేరింది. కొడంగల్, పర్సాపూర్ మధ్యలో పారుతున్న నీటితో యువకులు చేపలు పట్టారు.

వర్షపాతం(మి.మీలలో)	
నవాబ్‌పేట	127.3
మొగిలిగిద్ద	119.3
కేతిరెడ్డిపల్లి	118.5
కోట్‌పల్లి	117.4
బంట్వారం	112.5
తాళ్లపల్లి	109.5
వికారాబాద్	102.3
బషీరాబాద్	97.1
ధారూరు	85.8
మర్పల్లి	84.0
పెద్దేముల్	77.3
కొడంగల్	40.2


పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారం వద్ద లో లెవల్ బ్రిడ్జిపై మూసీనది ప్రవాహం


ధారూరు: రాంపూర్‌తండాలో వరద నీటి తాకిడికి నేలకొరిగిన వరి


మర్పల్లి: బూచన్‌పల్లిలో వర్షానికి కూలిన ఉప్పరి లక్ష్మి ఇల్లు

ఉధృతంగా మూసీనది ప్రవాహం

ఘట్‌కేసర్ రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎదులాబాద్, కొత్తగూడెం సమీపంలో మూసీ ఒడ్డున్న ఉన్న గంగమ్మతల్లి దేవాలయ పూర్తిగా మునిగిపోయింది. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారం వద్ద లో లెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహిస్తోంది. దీంతో గౌరెల్లి-ప్రతాప్‌సింగారంకు రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రతాప్‌సింగారం వద్ద మూసీ ఉధృతిని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పరిశీలించారు.


మర్పల్లి: వృద్ధురాలి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం వాగు దాటిస్తున్న సిరిపురం గ్రామస్తులు


బంట్వారం: వరదకు పూర్తిగా దెబ్బతిన్న పసుపు పంట వద్ద రైతు నరేష్


కొడంగల్-పర్సాపూర్ మధ్యలో పారుతున్న నీటిలో చేపలు పడుతున్న యువకులు


దోమ: మండలం ఐనాపూర్ పెద్ద చెరువు వద్ద 20 ఏళ్ల తర్వాత పారుతున్న అలుగు


కోట్‌పల్లి, బార్వాద్‌లో గొల్ల రాంచందర్ పొలంలో పాడైన పసుపు పంట

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్‌కు చెందిన మాజీ సైనికుడు అప్పలరాజు(36) తన కొడుకు, కూతురు చదువు కోసం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో నివాసముంటున్నాడు. శనివారం తన కొడుకు గణేష్‌తో కలిసి బైక్‌పై మేడ్చల్ వైపు వస్తుండగా మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలోని పిస్తా హౌజ్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో అప్పలరాజు తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతిచెందగా గణేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గణేష్‌కు వైద్యం నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బస్సులో ఓ ప్రయాణికుడు తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకోగా ఆ బస్సు డ్రైవర్, కండక్టర్ నిజాయితీగా దాన్ని తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. మెహిదీపట్నం నుంచి కొడంగల్‌కు వస్తున్న పరిగి డిపోకు చెందిన బస్సులో లగచెర్ల గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ వస్తున్నాడు. ఈ క్రమంలో తుంకిమెట్ల వద్ద బస్సు దిగుతుండగా అతడి సెల్‌ఫోన్‌ను బస్సులో పోగొట్టుకున్నాడు. గమనించిన కండక్టర్ యాదగిరి, డ్రైవర్ టి.రాములు సెల్‌ఫోన్‌ను శ్రీనివాస్‌కు కొడంగల్ బస్టాండ్‌లో అప్పగించారు.

గుట్కా పట్టివేత.. కేసు నమోదు

దోమ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ కిరాణాషాపు నిర్వాహకుడి వద్ద గుట్కా, పాన్ మసాలా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వసంత్‌జాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని పలు కిరణాషాపులు, పాన్‌డబ్బాల్లో శనివారం పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. శ్రీవీర భద్ర కిరాణాషాపులో నిషేధిత గుట్కాలు పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

షెడ్యూల్ కులాల వారికి రిజర్వ్ కాకపోవడం హాస్యాస్పదం

తాండూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే పంచాయతీ ఎన్నికల్లో గౌతాపూర్ గ్రామపంచాయతీలో వార్డు సభ్యుల రిజర్వేషన్‌లో షెడ్యూల్ కులాల్లో ఒక్కరికీ రిజర్వ్ కాకపోవడంతో హాస్యాస్పదమని టీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్ అన్నారు. ఆయన శనివారం తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్‌ను కలిసి మాట్లాడారు. గౌతాపూర్ పంచాయతీలో షెడ్యూల్ కులానికి చెందిన ఓటర్లు 300పైగా ఉన్నారని తెలిపారు. గౌతాపూర్ పంచాయతీలో 10వార్డు సభ్యుల్లో మూడు వార్డులు షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. ఒక్కవార్డులోనూ షెడ్యూల్డ్ కులానికి చెందిన రిజర్వ్ కాకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ పరిశీలించి, గౌతాపూర్ పంచాయతీలో షెడ్యూల్డ్ కులాల వారికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

పెద్దేముల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి మండలం ఎన్నారం గ్రామానికి చెందిన సంగీతకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. తాండూరు మాతాశిశు ఆస్పత్రికి సంగీతను అంబులెన్స్‌లో తరలిస్తుండగా పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామసమీపంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డను మాతాశిశు ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్ వినయ్‌కు సమాచారం ఇచ్చి ఆయన సూచనల మేరకు డెలివరీ విజయవంతం చేసినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ మోహన్ తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

కొడంగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో శనివారం ఓ వానరం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు పంచాయతీ సిబ్బందితో కలిసి వానరానికి పూజలు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

వర్షంలో వచ్చి.. చలికి వణుకుతూ..

● పింఛన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు



వర్షం పడుతున్నా పింఛన్ కోసం లబ్ధిదారులు చలికి వణుకుతూ పోస్టాఫిస్ ఎదుట పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకు పించన్‌లు పంపిణీ చేసిన పోస్ట్‌మెన్ చెప్పా పెట్టకుండా మిగతా లబ్ధిదారులను పోస్టాఫీస్ ఎదుట కూర్చోబెట్టి తాళం వేసి వెళ్లిపోయాడు. ఆయన రాకకోసం చలిలో వణుకుతూ అక్కడే కూర్చున్నారు. మూడు గంటల వరకు వస్తానని చెప్పి సాయంత్రం 5గంటలైనా రాకపోవడంతో లబ్ధిదారులు చలిలో వణుకుతూ వేచిచూశారు. ఈ విషయంపై ఎంపీడీవో వెంకట్ గౌడ్‌ను వివరణ కోరగా పోస్టాఫిస్ సిబ్బంది అలసత్వాన్ని డీఆర్‌డీవో పీడీ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

- బొంరాస్‌పేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్‌లో చేరికలు

దుద్యాల/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హకీంపేట్, లగచర్ల, దుద్యాల, రోటిబండ, గడ్డమీది, పులిచర్ల కుంట తండాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో శనివారం కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. హకీంపేట్‌కు చెందిన బీజేపీ నాయకుడు శివకుమార్, లగచర్ల మాజీ ఉప సర్పంచ్‌లు రాములునాయక్, రాఘవేందర్, వార్డు సభ్యులు వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, మదరప్ప, దుద్యాల వార్డు సభ్యులు ఆశప్ప, యాదయ్య, పులిచర్లకుంట, రోటిబండ, గడ్డమీదితండాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరినట్లు పార్టీ మండల అధ్యక్షుడు చాంద్‌పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, సురేశ్‌రాజ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్ బీజేపీని వీడి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, మహేందర్‌సాగర్, అంజయ్య ముదిరాజ్, లచ్చప్ప పాల్గొన్నారు.

కూరగాయ పంటల్లో నీరు నిలవకుండా చూడాలి

దోమ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు కూరగాయల పంటల్లో నీరు నిలవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని దోమ మండల హార్టికల్చర్ అధికారిణి అర్చన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టమాట, వంగ, మిరప నారుమళ్లను కాపాడటానికి ఆక్సిక్లోరైడ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కూరగాయ పంటలను ఆకుపచ్చ తెగుళ్ల నుంచి కాపాడటానికి కార్బన్డిజంతో పిచికారి చేసుకోవాలన్నారు.

తాండూరులో 18 మద్యం దుకాణాలు

తాండూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరులో 18 మద్యం దుకాణాలలో 5ఎస్సీలకు కేటాయించగా తాండూరు టౌన్‌లో ఎస్సీలకు మూడు, కోట్‌పల్లిలో ఒకటి, మల్కాపూర్‌లో ఒకటి, గౌడ కులాలకు రెండు కేటాయించారు. అందులో తాండూరు ఒకటి, బాగాయిపల్లి ఒకటి, మిగతా 11మద్యం దుకాణాలను ఓపెన్ క్యాటగిరిలో నిర్ణయించారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఎక్సైజ్ అధికారి, హైదరాబాద్ నాంపల్లి ఎక్సైజ్ హెడ్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అక్టోబరు 18వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం


ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్స్‌అందిస్తున్న శంకర్‌యాదవ్

మోమిన్‌పేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం 81 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సురేందర్, సిరాజుద్దీన్, సుభాష్‌గౌడ్, రవి, ఏజాజ్ పటేల్, ఏరాజ్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


ఎన్ఎఫ్‌సీ నగర్‌లో..


అన్నోజిగూడలో..


పోచారంలో..

ఘట్‌కేసర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరి నవశక్తి ఆలయంలో ఆరో రోజు శనివారం అమ్మవారు శీతల మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని గాయత్రి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పోచారంలోని సర్వమంగళ సమేత స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని, మందిరాన్ని తీరొక్క రంగు గాజులతో దేదీప్యమానంగా అలంకరించారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆరో రోజు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు పాండు శర్మ పూజలు, అభిషేకం, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. బండవెల్కిచర్లలో శనివారం దుర్గమాతకు బోనాలు ఘనంగా నిర్వహించారు. వర్షం కురుస్తున్నా మహిళలు గొడుగుల సాయంతో బోనాలను పురవీధుల మీదుగా తీసుకెళ్లారు. మహిళలు సంప్రదాయ రీతిలో నెలకొల్పిన దుర్గామాత మండపం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దుర్గమాత బోనాలు సమర్పించడం ఈ ప్రాంతంలో ఇదే మొదటి సారి.


కులకచర్ల: బండవెల్కిచర్లలో బోనాలు

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి


పరిగి: మాట్లాడుతున్న ఎంపీడీవో కరీం

పరిగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలని పరిగి ఎంపీడీవో ఎంఏ కరీం అధికారులకు సూచించారు. పరిగి, నస్కల్‌లో శనివారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

యాలాల: రానున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని యాలాల ఎంపీడీవో పుష్పలీల అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పీవో, ఆర్‌వో, ఏఆర్‌వో అధికారుల శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ప్రిసైడింగ్ అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికలకు సంబంధించిన ట్రైనర్ వీరేశం వారికి తగు సూచనలు చేశారు.

కొడంగల్: మండలానికి చెందిన ప్రిసైడింగ్ అధికారులకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈవో రాంరెడ్డి పాల్గొని ప్రిసైడింగ్ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు.

దుద్యాల: పోలెపల్లి రైతు వేదికలో ప్రొసిడింగ్ అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారుల శిక్షణలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆనందం, మోహన్, కిషన్, జైపాల్, రమేశ్ రాథోడ్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

కులకచర్ల: స్థానిక రైతు వేదికలో మండల పరిధిలోని పోలింగ్ అధికారులకు ఎంపీడీవో రామకృష్ణ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ఎంపీవో భాస్కర్‌గౌడ్, పీవోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు న్యాయం


దుద్యాల: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దుద్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దుద్యాలలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రవి నాయక్, శ్రీశైలంగౌడ్, సత్యనారాయణ, రఘుపతి, అనంతయ్య, లాలప్ప పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల పట్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలోని భూ లక్ష్మమ్మ చౌరస్తాలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


బొంరాస్‌పేట్: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎకరాకు రూ.50వేలు పరిహారమివ్వాలి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50వేలు పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని దామస్తపూర్ తదితర గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను శనివారం పరామర్శించారు. ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల లక్ష్మయ్య, మోహన్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దోమ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కూర్ గ్రామంలో ఘనపూరం నర్సిములు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి తాను అందుబాటులో లేకపోవడంతో తన అనుచరుల ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా అనంతరెడ్డిపల్లికి చెందిన నరేందర్‌రెడ్డి మృతి చెందడంతో కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్ రాజీరెడ్డి, లింగయ్య, శివయ్య, వెంకటయ్య, శేఖర్, గోపాలకృష్ణ, లక్ష్మయ్య, వెంకట్, రాములు, మల్లేశ్, సారంగి, లాలేందర్, శ్రీనివాస్, శ్యామ్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

పరిగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిపిపల్ కార్యాలయంలో శనివారం తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. బాపూజీ చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నరేష్, సంపత్, దశరథం, బస్వరాజు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా సద్దుల బతుకమ్మ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) సద్దుల బతుకమ్మ వేడుకలను శనివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజులకు జరుపుకోకుండా మేడ్చల్ పట్టణంలో 7వ రోజు జరుపు కోవటం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మేడ్చల్ పట్టణంలోని వాడవాడన మహిళలు అందమైన బతుకమ్మలతో ఆట పాటలతో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.

ఘట్‌కేసర్: సద్దుల బతుకమ్మ వేడుకలను శనివారం ఘట్‌కేసర్‌లో ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడలో పూర్వం నుంచి ఎడురోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తారు. శనివారం ఘట్‌కేసర్ పట్టణంలో గురుకుల్ కళాశాల మైదానంలో, ఎదులాబాద్ రోడ్డులోని నాగులమ్మగుడి, చిన్నచెరువు తదితర చోట్ల బతుమ్మలను ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటలు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


ఘట్‌కేసర్: బొక్కోనిగూడ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో శనివారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉదయం రంగురంగుల పూలను తీసుకొచ్చి బతుకమ్మను పేర్చారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన చౌరస్తాల వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. డీజే పాటలకు ఉత్సాహంగా మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆడే చోట ఆడపడుచులకు ఇబ్బంది కలగకుండా లైట్లు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, నాయకులు, చిన్నారులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారంలోని తన నివాసంలో బతుకమ్మను పేర్చుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి